# పిల్లల హృదయం పెద్దలకుంటే?

రచన : శ్రీ సి. సి. పున్నయ్య — (గత సంచిక తరువాయి)

ఆరు నెలలు గడిచినవి. కృష్ణమూర్తి ఏసంబంధం చేసుకోడానికి సమ్మతించలేదు. శ్రీలక్ష్మి గారి యింట్లో పోషణ, పరామర్శ లేక రాధ చిక్కి శల్యమైపోయింది. తాను అనుకున్నట్లు కొడుక్కు పెండ్లి కాకపోగా పెంచిన రాధను గురించి ఆదుర్దా ఎక్కువై చూచి వద్దామని బయలుదేరి వెళ్ళింది. వాకిట్లోనే ఎదురైన రాధను చూచేసరికి వరలక్ష్మమ్మ గుండె నీరయింది. మసి పాతలాంటి కట్టుకున్న చీర, లోపలికి పీక్కునిపోయిన దవడలు, కండ్లు, పాలిపోయిన ముఖము రాధకు ప్రేతకళను కల్పించినవి. వరలక్ష్మమ్మను చూచి బావురుమని ఏడుస్తూ కుప్పకూలిపోయింది, వరలక్ష్మమ్మ ఆమెను రెండు చేతులతో లేవనెత్తి అశ్రుపూరిత నేత్రాలతో'' పిచ్చి తల్లీ ఏడవకు'' అని యూరడించింది. మరునాడుదయమే రాధతో బాటు వరలక్ష్మమ్మ యింటికివచ్చి చేరింది. గిరిధరరావు, కృష్ణమూర్తి, రమణ రాధను చూచి జొటబొట కన్నీరు కార్చారు.

కృష్ణమూర్తికి, రాధకు ముచ్చటగా వివాహమయింది. బీదయింటిపిల్లయినా ఉదార హృదయంతో పెంచి పెద్దదాన్ని చేసి తనకోడలుగా చేసుకొన్నందుకు చాల మంది గిరిధరరావు దంపతుల నభినందించారు. కృష్ణమూర్తి తను కోరినట్లు రాధ తనకు భార్య కావడం అదృష్టమనుకున్నాడు. శ్రీలక్ష్మి మాత్రం తన తమ్ముడి పెళ్ళికి రాలేదు సరిగదా ఆ నాటి నుండి యీనాటివరకు పుట్టింటి గడపత్రొక్కింది కాదు.

రాధా, కృష్ణులది ఆదర్శనీయమైన దాంపత్యము. వారిపరస్పర ప్రేమానురాగాలు వారి జీవయాత్రను మెరుగులు దిద్దినాయి. రాధ నిరాడంబరత్వము, సౌశీల్యము, ఓర్పు ఆమెకు యింటబయటకూడ ఆదరాభిమానములను సమకూర్చి పెట్టినవి. వరలక్ష్మమ్మ, గిరిధరరావు కోడలిని చూచి ఎంతగానో మురిసిపోతుంటారు.

●

తస్వీర్ స్తాన్ (బొంబాయి) వారు పండరిబాయ్, శ్యామ్, రాజ్‌కుమార్, జబన్. డేయస్ ఇరాణిలతో ''పంచాయత్'' అనే చిత్రం తయారుచేస్తున్నారు.

---

''కథాంజలి''లో వెలువడే కథలన్నీ కేవలము కల్పితము. ఎవరినీ ఉద్దేశించి వ్రాసినది కాదు.

రచయితల రచనలకు మేము ఏమాత్రమూ భాద్యులు కాదు.

—సంపాదకుడు

